భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి


మయూర వాహనంపై ఊరేగుతున్న దృశ్యం


తిమ్మాజిపల్లిలో ఉత్తర ద్వారంలో శ్రీరాముల వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు


చాగదోణలో నిర్వహిస్తున్న పల్లకీ సేవ

- కిక్కిరిసిన ఆలయాలు
- ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం
- ప్రత్యేక పూజలు చేసిన ప్రజలు

ఎర్రవల్లిచౌరస్తా: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోదండరామస్వామి, జ్ఞాన సరస్వతి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆయా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు మొక్కులు తీర్చుకున్నారు.

చింతలమునిస్వామి పల్లకీ సేవ

గట్టు: మండలంలోని చాగదోణ శివారులోని నల్లరెడ్డి చింతలమునిస్వామి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. దశమి కట్ట నుంచి చింతలముని ఆలయం వరకు స్వామివారి పల్లకీసేవ వైభవంగా ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు అభిలాష్, మురళి, నిర్వాహకులు రమేష్‌గౌడు, పురుషోత్తమ్‌గౌడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ మాధవస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని గోమాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, హుస్సేన్, రామకృష్ణారెడ్డి, జయసింహారెడ్డి, బీచుపల్లినాయుడు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన వేంకటేశ్వరస్వామి వారిని, రామాలయంలో వెలసిన శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామిని, మారుతీ నగర్‌లో వెలసిన శ్రీరాములవారిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. మండలం లోని రామాపురం, కొంకల, కోయిల్‌దిన్నె, గాంధీనగర్, జూలెకల్, తనగల, తిమ్మాజిపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి, పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి, మండంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు మూడు ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నామస్మరణతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగాయి.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారంలో ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కేటీదొడ్డి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారాల్లో తెల్లవారు జామున తహసీల్దార్ సరితరాణి, ఎస్‌ఐ వెంకటేష్, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి బంగారం అందజేత

మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆత్మకూర్‌కు చెందిన శివకుమార్, అరుణ దంపతులు 15 తులాల బంగారంతో వేంకటేశ్వర స్వామి పాదాలు చేయించి స్వామి వారి చెంత అలంకరణ చేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన జయమ్మ రూ.25 వేలు, బోయ శివమ్మ రూ.16 వేలు ఆలయానికి విరాళం అందజేశారు.


ఆలయానికి 15 తులాల బంగారు పాదాలు విరాళం అందజేత


శాంతినగర్‌లో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

క్లుప్తంగా

ఘనంగా నో స్కూల్ నో బ్యాగ్ దినోత్సవం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరు ప్రాథమిక పాఠశాలలో శనివారం నోస్కూల్ నోబ్యాగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక గ్రామ పంచాయతీని క్షేత్రస్థాయిలో సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి మస్తాన్ గ్రామ పంచాయతీ విధి విధానాలు, కార్యకలాపాల గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

స్వామిని దర్శించుకున్న బంగారు శ్రుతి

అయిజ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

అలంపూర్: ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరంగా మున్సిపాలిటీలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని దుస్తుల పంపిణీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులకు ఆహ్వానం అందించలేదని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

నాణ్యతలోపంగా గ్రంథాలయ నిర్మాణ పనులు

గద్వాల రూరల్: పట్టణంలోని 20వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయని వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఆరోపించారు. శనివారం నిర్మాణ పనులను పరిశీలించి, పనులు నాసిరకంగా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా జరుగుతున్నాయని సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రశ్నించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడినట్లు తెలిపారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. వెంటనే నాసిరకంగా జరుగుతున్న పనులను నిలిపేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన

గట్టు: రహదారులపై వాహనదారులు ప్రయాణిస్తున్న ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, షీ టీం కళాబృందం అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ కళాబృందం, షీటీం సభ్యుల ఆధ్వర్యంలోని ప్రజలకు మూఢనమ్మకాలపై, సైబర్ నేరాలపై బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, భరోసా సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్పంతో విజయం సాధించాలి

మానవపాడు: పట్టుదల, నిరంతర కృషి, సంకల్ప బలంతో ఎన్ని అవరోధాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఫిల్మ్ ఆర్టిస్ట్ రమణామూర్తి తెలిపారు. సొంత గ్రామం నిజామాబాద్ జిల్లాని, 2008 నుంచి ఇప్పటి దాకా సినిమాలో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 300 నాటికలు వేశానని, జాతీయస్థాయిలో ఉత్తమ విలన్‌గా నాటికలో రెండు సార్లు అవార్డులు వచ్చాయని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో నాటికలో 10 అవార్డులు వచ్చాయని తెలిపారు. ఉప్పెన, బుట్టబొమ్మ, యాత్ర–2, లంబసింగి, జైబోలో తెలంగాణ, వాంటెడ్, కృష్ణం వందే జగద్గురు, కంచె, టైగర్ నాగేశ్వర్‌రావు తదితర సినిమాలలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పని చేశానని 2025 నాటికి సొంతంగా సినిమా చేస్తానని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి

అయిజ: వాజపేయి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహేర్, బీజేపీ నాయకులు అశోక్, భగత్‌రెడ్డి, చిన్ని కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్వ మతాలకు ప్రాధాన్యం

అలంపూర్: రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంలో సర్వ మతాలకు ప్రాధాన్యం ఉంటుందని ఎంపీపీ బేగం అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీటీసీ శంషాద్‌ఇస్మాయిల్, ఎంపీపీ బేగం, తహసీల్దార్ మంజుల, పాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు కేక్‌కట్ చేశారు. అనంతరం క్రైస్తవ సోదరులకు దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉండవెల్లి జడ్పీటీసీ రాములమ్మ, కౌన్సిలర్ లక్ష్మీదేవి, కాంగ్రెస్ నాయకులు జాన్, రమణ, నరసింహ, మహేష్ గౌడ్, ధర్మరాజు, నర్సన్ గౌడు, ధర్మరాజు, ఫయాజ్, రామకృష్ణ, ముస్తఫా, ఆనంద్ కుమార్, సుందర్ రాజు, బాబు, పెద్దబాబు ఉన్నారు.


దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులోని కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ ఉయ్యాలవాడ గజేందర్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో పలు ప్రజాప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు పాడె మోశారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు


ధరూరులో ఎంబీ చర్చి వద్ద అలంకరించిన పశువుల పాక


క్రిస్మస్ వేడుకలలో చిన్నారులతో పాఠశాల సిబ్బంది

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేరీ, శాంతాక్లాస్, దేవదూతల వేషధారణలో కొత్త దుస్తులను ధరించి అలరించారు. అనంతరం కేక్ కట్‌చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం ఆట పాటలతో చిన్నారులు నృత్యాలు చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దుస్తుల పంపిణీ

అయిజ: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో శనివారం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పండుగలను మతాలకు అతీతంగా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని, అన్ని శాఖల అధికారులు, పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

చర్చిల వద్ద పశువుల పాకల అలంకరణ

ధరూరు: మండలంలో క్రిస్మస్ సందడి మొదలైంది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల చర్చిల వద్ద ఏసు క్రీస్తు జనన విధానాన్ని తెలియజేసే పశువుల పాకలను అందంగా అలంకరించారు. చర్చిల ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాకల్లో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేసి అందంగా తీర్చి దిద్దారు. ధరూరు ఎంబీ చర్చి వద్ద ఏర్పాటు చేసిన పశువుల పాక ఆద్యాంతం ఆకట్టుకుంటుంది.

అడ్డంకులను అధిగమించాలి

అయిజ: ఎదురైన అడ్డంకులన్నిటిని అదిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలని మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర ధీర మాట్లాడారు. అమ్మాయిలకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఇప్పటి నుంచి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని వాటికోసం ఒక ప్రణాళిక వేసుకొని గమ్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్ మాస్టర్ బేబి కళ, ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీర

పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

మానవపాడు: గ్రంథాలయాలు జ్ఞాన నిధి భాండాగారాలని, విద్యార్థులకు నిత్యం పఠన పాఠ్యాంశాలను నిత్యం అవపోసానం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీఈఓ ఇందిర అన్నారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జల్లాపురం గ్రామంలో గ్రంథాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు సాంకేతికతతో పాటు విజ్ఞానంకోసం పఠన పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించడం గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. మౌలిక వసతులక కల్పనకు కృషి చేసిన ఉపాధ్యాయులు వెంకన్న, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు వెంకన్నకు రూ.20వేలు విరాళంగా అందించారు. ఇంగ్లిష్ గ్రంథాలయంగా మార్చిన తరగతి గదిలో ఇంగ్లిష్ గ్రామర్‌పై సంక్షిప్తంగా రాయించిన ఉపాధ్యాయుడు వెంకన్నకు ఎస్‌ఏఆర్‌ఏ కాంత్రికుమార్ రెడ్డి పాలమూర్ ఎస్‌ఆర్‌ఏ సౌజన్యంతో రూ.20వేల నగదు, పూలమాల, శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయుడు వెంకన్న 10 తరగతి నుంచి 6వ తరగతి వరకు ప్రతి రోజు క్రమంతప్పకుండా హాజరైన వారికి మంజుల, ఆఫ్రీన్, జీవిత, మహేందర్‌లను పూలమాల, శాలువా, బహుమతులతో డీఈఓ ఇందిర సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, మరళీధర్, సురేష్, శ్రీలక్ష్మి, రియాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ ఇందిర, పాఠశాల ఉపాధ్యాయులు

పరిష్కారం కోసమే సమావేశాలు


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారెడ్డి

మల్దకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల సర్వసభ్య సమావేశాలలో పరిష్కరించుకునేందుకే ప్రతి మూడు నెలలకోసారి మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి వాటిని అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. శనివారం మల్దకల్ మండల సమావేశపు హాల్లో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను అధికారులు బాధ్యతగా వ్యవహరించే వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని అధికారులు వచ్చే సమావేశం నాటికి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలపై సమావేశంలో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్‌ఎంపీపీ పెద్ద వీరన్న, మధుసూదన్‌రెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయం దగ్గర శనివారం ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తులకు ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి మాలను దరించి 40 రోజులు కావడంతో ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చరణతో ఇరుముడి కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆలాపనలతో పాటలు పాడుతూ పాదయాత్రగా ఆంజనేయస్వామి ఆలయానికి బయలుదేరారు.

ఘనంగా మౌలాలి ఉర్సు

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట గ్రామంలో శనివారం మౌలాలి, ఖాసీం తాత ఉర్సు ఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జా తర కనుల పండువగా నిర్వహించారు. గ్రామ శివారులో ఉన్న మసీద్ వద్ద భక్తులు దాసొంగాలు, పోట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకునేందుకు భారీ ఎత్తున తరలివెళ్లారు. సర్పంచు సువర్ణమ్మ నేతృత్వంలో నిర్వహించిన ఉత్సవాల్లో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. తాయప్ప, ధనంజయ్, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో గ్రామంలోని రైతు వేదికలో ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్యభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. శనివారం పుల్లూరు రైతు వేదికలో రైతు దినోత్సవం నిర్వహించి క్రిమి సంహారక మందులపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగరాజు, తదితర్లు పాల్గొన్నారు.


పుల్లూరు రైతు వేదికలో రైతులు

అందని ఆయుర్వేద వైద్యం

- ప్రజల్లో అవగాహన లోపం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మానవపాడులో యునానీ ఆయుర్వేద వైద్యశాల

మానవపాడు: యునానీ ఆయుర్వేదం ప్రజలకు అందుబాటులో లేక కనుమరుగౌతోంది. ఇంగ్లిష్ మందులకి డిమాండ్ పెరగడంతో ఆయుష్ కేంద్రాల పేరుతో అందించే సేవలు క్షేత్రస్థాయిలో రోగులకు అందడం లేదు. అవగాహన లేమీ కారణమైతే వైద్య సిబ్బంది కొరతతో ఆయుష్ కేంద్రాలను కంపౌండరు నిర్వహించాల్సిన పనులు డాక్టర్లు నిర్వహిస్తున్నారు. మండలంలో కేంద్రంలోని యునానీ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ మాత్రమే ఉన్నారు. ఫార్మాసిస్ట్, అటెండర్ లేరు. ఈ వైద్యశాల వైద్యసిబ్బంది సరిగా లేక సక్రమంగా తెరుచుకోవడం లేదు. దీంతో మండల ప్రజలకు ఆయుర్వేదం అందని ద్రాక్షలా మిగిలింది. ఇక్కడ పని చేసిన వైద్యుడు మరో చోటా పనిచేస్తూ రెండు చోట్లా విధులు నిర్వహించాల్సి వస్తోంది. రోగులు పడుతున్న ఇబ్బందులు, వైద్యసిబ్బంది నియామకాలపై ఉన్నతాధికారులు చర్యల తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఆయుష్ కేంద్రాలపై జిల్లాస్థాయి పర్యవేక్షణ కొరవడింది. ఆయుష్, యునానీ ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది ఉన్నారా? ఉన్న వైద్యసిబ్బంది సమయానికి వస్తున్నారా? ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడ వెళ్తున్నారో.. తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న మందులు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. తద్వారా ఆయుర్వేద వైద్యం చేయించుకోవడానికి రోగులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి మండల ప్రజలకు యునానీ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది కొరత తీర్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



యునానీ ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది కొరతను తీర్చాలి. ప్రజలకు సరైనా వైద్యసేవలు అందుబాటులో లేవు. వైద్యశాలలో రోగులకు యునానీ వైద్యసేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మన్న, చెన్నిపాడు

అవగాహన కల్పించాలి



మానవపాడు మండల కేంద్రంలోని ఆయుర్వేద యునానీ వైద్యం ప్రజలకు అందుతుందా? లేదా అని అధికారులు పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలో యునానీ ఆయుర్వేద వైద్యశాలలో ప్రజలకు, రోగులకు అవసరమైన మందులను వివరించాలి. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి.

– కిశోర్, బోరవెల్లి

నిర్లక్ష్యం వీడాలి



క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు నిర్లక్ష్యం వీడి. డాక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలి. ప్రతి ఒక్కరికి ఆయుర్వేదం గురించి వివరించి, వాటి ప్రాముఖ్యతను తెలియజేయాలి. వైద్యశాలలో ఉన్న వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వీడి ప్రజలకు సేవల చేసే విధంగా ఉండాలి.

– రాజు, చంద్రశేఖర్‌నగర్

రామమందిర అక్షతలు ఊరేగింపు

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు ఆలయం నుంచి అయోధ్య రామమందిరం నుంచి అక్షతలను బీచుపల్లి పుణ్యక్షేత్రం నుంచి తీసుకొచ్చి మండల కేంద్రంలో ఊరేగించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిల్వ చేసి జనవరి 2 నుంచి గ్రామాల్లో ఇంటింటా అక్షతలు పంచుతారని, భక్తులు పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల భక్తులు, స్వాములు పాల్గొన్నారు.


డి.బూడిదపాడులో రామమందిర అక్షతలతో భక్తులు

ప్లాస్టిక్‌ను నివారిద్దాం

కొత్తకోట రూరల్: పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ అన్నారు. పర్యావరణ్ ఎన్‌జీఓ నెట్‌వర్క్, తెలంగాణ సహకారంతో జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడటం వలన కలిగే అనర్థాలు, జరుగబోయే నష్టం, వాతావరణం కలుషితం గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.